# బ్రతుకులో వెన్నెల

"గ్లాసు పట్టుకుని అలా కూర్చున్నావేంటే...?" మళ్లీ అంది అమ్మ "కాఫీ తాగు..."

అమ్మ ఆ మాటలు అనడం మూడోసారి. కాని నేను పట్టించుకోలేదు. రోడ్డు చూస్తూ కూర్చున్నాను.

అంతవరకు కోపంతో మండిపడిన సూర్యుడు మెలమెల్లగా చల్లబడుతున్నాడు. అమాయకులైన తన బిడ్డల్లాంటి మానవుల మీద నిప్పులు కురిపించటం సరికాదని తెలుసుకొని చల్లటి కిరణాలు వెదజల్లుతున్నాడు.

రోడ్డు మీద నీరెండలో ఆడుకుంటున్నారు పిల్లలు. మూడు చక్రాల సైకిళ్లు తొక్కేవారు కొందరు; పరిగెట్టి ఆడేవారు కొందరు; క్రికెట్ ఆడేవారు కొందరు. ఒకటే గోల అరుపులు కేరింతలు!

పిల్లల ఆట చూస్తూ వీధి గుమ్మం వద్ద నిలబడిన తల్లుల మోములు సాయం సందర్భంలో గుబాళించే సన్నజాజులలా ఉన్నాయి సూర్యుడు పూర్తిగా అస్తమించక ముందే వారి ముఖాల్లో నుంచి వెన్నెల జాలువారుతోంది.

నా మనసు బాధతో మూలిగింది. మా అబ్బాయి బుజ్జి ఏం పేచిపెడుతున్నాడో... అల్లరికే చిరునామా వాడు. ఆయన మాటలు అసలు ఖాతరు చెయ్యడు.

వాడు బడి నుండి వచ్చినప్పుడు ఆయన ఇంటిలో ఉన్నారో... లేదో... వాడు బడికి వెళ్లి ఉంటాడా...? అమ్మ కనబడలేదని ఏం పేచీలు పెడుతున్నాడో ఏమో... పేచీలు మొదలైతే వాడిని సముదాయించడం చాలా చాలా కష్టం. ఆయన మాటలకి అసలే లొంగడు వాడు. ఒకసారైతే...

వాడు స్కూలు నుంచి వచ్చే వేళకి ఆఫీసు నుంచి రాలేకపోయాను. ఆయన ఇంటిలోనే వున్నారు. అయినా వాడు అమ్మ కావాలని పేచి పెట్టి ఏడ్చి ఏడ్చి ఇంటి బయటకు పరుగెత్తుకువచ్చి ఇంటి ముందు బావిదగ్గరకి...

టైంకి ఇల్లు చేరాను కనుక సరిపోయింది. లేకపోతే... ఒంటిలో కరెంటు పాకినట్టు తోచింది. గుండె గబగబ కొట్టుకుంది ఇంటిలోకి పరిగెత్తాను. హ్యాండు బ్యాగు తీసుకొని

వేటగాడు తరిమే లేడిలా రోడ్డుమీదకి వస్తూవుంటే అమ్మ అడిగింది.

"ఏమిటే...? ఏమైంది? ఎందుకు ఈ పరుగు?"

మా ఇంటికి వెళ్ళిపోతున్నాను.

వెళ్లు కాని ఏమిటీ తొందర? రెండు రోజులు ఉంటానని అన్నావుగా...

అవును! అన్నాను. రెండు మూడు రోజులు ఉంటాననే వచ్చాను కాని...

అసలు నువ్వు ఎందుకు వచ్చినట్టే... అమ్మ మళ్ళీ అడిగింది.

ఎందుకు వచ్చినట్టు? ఏమో...! నాకే తెలియదు హఠాత్తుగా చెలరేగిన గాలికి కదిలి, ఎగిరే ఆకులకు ఎందుకు పరుగులు తీస్తున్నామని తెలియదు కదా!

బస్సులో కూర్చున్నా నా మనసులో అదే ఆలోచన... అమ్మ వాళ్ల ఇంటికి ఎందుకు వచ్చినట్లు... అసలు ఏమైంది?

నిన్న కూడా నిద్రలేస్తూనే ఆయన ముఖమే చూసాను. నిజం చెబుతే ఆయనే నన్ను కుదిపి, కుదిపి లేపారు.

"లే... లేవే.. ఏడు దాటిందే" అవేమాటలు అష్టోత్తరంలా చదువుతూ తట్టి లేపారు.

"ఏమిటీ లేపటం, కొంపమునిగిపోయినట్టు..."

కళ్లు నులుపుకొని కోపంగా అరిచాను. ఒళ్లు విరుచుకొని బద్ధకంగా ఆవలించాను. ఆదివారం కూడా, కాసేపు పడుకోనివ్వరు. నా ఖర్మ... నేను విసుక్కున్నాను.

అసలే నిన్న రెండో ఆట సినిమా చూసి పడుకున్నాం. లేకపోయినా వారానికి ఆరు రోజులు ఇంటిపని ఆఫీసు పని చేసే ఇల్లాలు, మగాడికన్నా ఎక్కువ అలసిపోతుందనే గుర్తించరు మా ఆయన!

"టైం అయిపోయిందే" మెత్తగా అన్నారు ఆయన.

"కాస్త కాఫీ నీళ్లు నా ముఖాన కొట్టు. క్లబ్బుకి వెళ్ళి టెన్నీసు ఆడి వస్తాను."

అది ఆయన తొందరకి కారణం! ఆరు నూరైనా, నూరు ఆరైనా ప్రతిరోజు ఏడు గంటలకి క్లబ్బుకు వెళ్ళవలసిందే! టెన్నీసు ఆడవలసిందే!

ఆఫీసుకి కాస్త లేటైనా ఆయన పట్టించుకోరుకాని టెన్నీసుకు లేటైతే మాత్రం అగ్గి మీద గుగ్గిలమై పోతారు. ఏం చెయ్యగలను? మార్చలేని వాటిని భరించవలసిందేకదా!

ఆయన బయలుదేరినప్పుడు చిన్న చిన్న వానతుంపరలు పడుతూ వుండేవి. ఆకాశం నిండా నల్లని మబ్బు ఏ నిమిషంలోనైనా వర్షించడానికి సిద్ధంగా వున్న నల్లనిమబ్బు ఆకాశం భూమిమీద విసిరే పరుషపు మాటలగాలి ఒంటికి తగిలి పని చెయ్యాలనే ఉత్సాహాన్ని హరించింది. తుఫాను హెచ్చరిక వుందని శనివారంనాడు నా స్నేహితురాలు చెప్పిన మాట గుర్తుకొచ్చింది.

ముసుగుతన్ని పడుకోవడానికి అనుకూలమైన వాతావరణం! మరి కొంతసేపు నిద్రపోవాలని అనుకున్నాను. వీధి తలుపు వేసి వెను తిరగగానే గోడమీద అమర్చిన ఛాయాచిత్రం కనబడింది. పులినోటిలో చిక్కుకున్న లేడిపిల్ల చిత్రం అది.

ఆ ఛాయా చిత్రం అంటే ఆయనకి చాలా ఇష్టం. అందువల్ల దుమ్ముధూళి పట్టకుండా తరచూ శుభ్రం చేస్తూ వుంటారు. ఆ చిత్రాన్ని మొన్న మొన్నటివరకు సెలవుల్లో లేడి పిల్లల వేటకి వెళ్ళేవారు కూడా!

మంచం దగ్గరకి వెళ్లానో లేదో ఎందుకో గావుకేక వేసి లేచి కూర్చున్నాడు బుజ్జి. వాడిని పడుకోబెట్టి జో కొట్టి నిద్రపుచ్చుతూ వుంటే వాడు లేచి తుర్రుమని పారిపోయాడు. అరుస్తూ గోలచేస్తూ ఆట మొదలు పెట్టేసాడు. ఇంకేముంది, రోజు మొదలైంది. నిద్ర ముంచుకొచ్చినా, ఇంటి పనిలో పడ్డాను.

బయట జోరుగా వానకురుస్తూ వుంది. వానలో తడుస్తూ ఆడుతున్నాడు బుజ్జి. వాడిని బతిమాలి తిట్టి ఒకటి కొట్టి ఇంటిలోపలకు తీసుకురావడానికి నా తల ప్రాణం తోకకు వచ్చింది. బాగా అలసిపోయాను. ఆలోగా వచ్చారు ఆయన.

“ఏమోయి టిఫీను రెడీయా?' రాగానే అడిగారు జవాబు చెప్పలేదు.

మళ్లీ నిద్రపోయావా? ఆయన అన్నారు. బాగా నిద్ర తీసినటున్నావే...

నాకు ఒళ్లుమండిపోయింది. “అబ్బా కొడుకులు నన్ను నిద్రపోనిస్తేగా...” చికాకుగా అన్నాను. నా ముఖానికి నిద్ర ఒకటి...

ఆయన మోము వాడింది. కాసేపు పోయాక అన్నారు. “ఈరోజు పెసరట్టు ఉప్మా చెయ్యమన్నాను కదే...”

ఏమి అనలేదు. కళ్లు మూతలు పడుతున్నాయి. “మన రామారావు పెళ్ళాం లేదూ...” ఆయన మళ్ళీ అన్నారు “ఆదివారం నాడు రకరకాల టిఫిన్లు చేస్తుందట.”

“అయితే అక్కడకే వెళ్ళి తినండి” విసురుగా వంట గది బయటకు వచ్చేసాను. పొయ్యి ఆపలేదు.  బానలిలోని పోపు మాడిమసైంది.

“అమ్మా! నాకు మాగీ!” మా వాడు వచ్చాడు, ఏడుస్తూ- “అమ్మా! మాగీ!”.

“ఇప్పుడే మాగీలేదు గీగీ లేదు పో!” నా విసురు ఆయన మీద చూపలేక వాడిని రెండు బాదాను.

కెవ్వుమని కేకవేసి ఏడుపు అందుకున్నాడు వాడు. ఎర్రగా కందింది మా ఆయన ముఖం. పిల్లాడ్ని కొడతావెందుకు? వాడు ఏం అడిగాడని ఆయన కళ్ల నుంచి నిప్పులు స్ఫులింగాలు రాలాయి.

“ఏమడిగినా నా వల్లకాదు. వండి పెట్టేవాడికి తెలుస్తుంది ఆ బాధ.”

“ఏదో పెద్ద వండిపెట్టేస్తున్నట్లు ఈ మాత్రం ఎవరైనా చెయ్యగలరు?”

"అయితే చేసుకోండి" నేను వెళ్ళి మంచం మీద పడ్డాను.

బయట వాన జోరు పెరిగింది. మామధ్య మాట మాట పెరిగింది. నేనూ తగ్గలేదు. ఆవేశంతో ఊగిపోయాడు ఆయన. చివరికి పళ్లు కొరుకుంటూ కసిగా కోపంగా నన్ను సమీపించి చెయ్యి ఎత్తాడు. ఎత్తిన చెయ్యిగట్టిగా పట్టుకొని కిందికి దింపి నా హ్యాండు బ్యాగు తగిలించుకొని బయటకు వచ్చాను.

"ఏమిటే, ఇంత హఠాత్తుగా" ఇంటి తలుపు తీసిన అమ్మ ఆశ్చర్యంగా అడిగింది.

నేను మాట్లాడలేదు. ఒక ఉదుటున ఇంటి లోపలకివెళ్లి మంచం మీద వాలాను.

ఏమైందే... అమ్మగొంతులో కంగారు. "చెబుతాను లే అమ్మా. రెండు రోజులు ఉంటానుగా."

మరునాడు మధ్యాహ్నం లేచాను. సాయంత్రం కాఫీ తీసుకుంటూ వివరాలు అడిగి తెలుసుకోవచ్చునని అనుకొని ఉంటుంది అమ్మ!

మా ఇల్లు చేరాను. ఇల్లు చీకటిలో మునిగి వుంది. వీధిగుమ్మంలోని బల్బు వెలగడంలేదు. పడకగదిలో మాత్రం కొంత వెలుతురు కనబడింది. కాలింగ్ బెల్లు నొక్కాను. తలుపు తీసారు ఆయన. పలకరించలేదు. చిరునవ్వైనా నవ్వలేదు. నేరుగా పడకగది లోకి పరుగుతీసాను. వాడిన తోటకూరకాడలా మంచం మీదపడి ఉన్నాడు మా అబ్బాయి. వాడి ముఖంమీద కన్నీటి చారలు స్పష్టంగా కనబడ్డాయి. నిద్రలో అమ్మా అమ్మా... అని కలవరిస్తున్నాడు.

నా గుండె కరిగిపోయింది. సూర్యోదయమవగానే కరిగిపోయే మంచు బిందువులా నా కోపం విసుగు కరిగిపోయింది. ఆప్యాయంగా వాడి తలనిమిరాను. నా కళ్ల నుంచి రాలిన వెచ్చటి కన్నీరు వాడి మీద పడ్డాయి.

తుళ్ళిపడిలేచాడు వాడు.

అమ్మా... నాన్న కొట్టారు...

వాడిని అక్కున చేర్చుకున్నాను.

అమ్మా... ఆకలి...

పక్కనే నిలబడి వున్న ఆయన వైపు చూసాను కోపంగా. అంతకోపంగా చూడనక్కరలే. అన్నం పెట్టే పడుకోబెట్టాను.

అన్నం కాదమ్మా గంజి...

నాకు నవ్వు వచ్చింది. గబగబ అన్నం వండి తినిపిస్తూ వుంటే వాడి ముఖం వెలిగింది. నా ఎదుట అప్పుడే చందమామ ఉదయించినట్టు తోచింది నాకు. అవును! చందమామ! నా బ్రతుకులో వెన్నెల నింపే చందమామ!

***